సక్సెస్ స్టోరీ

# గంజి..గట్కతో గగన విహారం





జయసింహ

స డుగులు విరిగిన మగ్గం... తొమ్మిది మంది ఉన్న పెద్ద కుటుంబం... రెక్కాడినా డొక్కాడని పరిస్థితులు. నల్గొండ జిల్లా కట్టంగూర్ గ్రామానికి చెందిన వెంకట నర్సయ్య, లక్ష్మి కౌసల్య ఏడుగురు సంతానంలో ఒకడైన జయసింహ బాల్యం అంతా నల్లేరుపై నడక కాదు... పల్లేరు ముళ్ళమీద సాగింది.

తినడానికి తిండి లేక గంజి నీళ్ళతో వెళ్ళదీసిన రోజులే ఎక్కువ. తల్లికి కుట్టుపనిలో చేదోడుగా ఉన్నా, ధ్యానంతా చదువు మీదే. కానీ సహకరించని ఇంటి ఆర్థిక పరిస్థితులు. ఐనా పట్టు వదలకుండా చదివి పదో తరగతిలో నల్గొండ జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచారు. ఇంటర్ చదువుతూ ఉద్యోగ ప్రయత్నంగా ఇండియన్ ఎయిర్ ఫోర్స్ లో టెక్నీషియన్ పోస్ట్ కు దరఖాస్తు చేయడం, వారు పెట్టిన రాత పరీక్షలో పాసయినా, శరీర దార్ఢ్యం సరిపోకపోవడంతో పరీక్ష నిర్వహించిన వారు "తిని మూడు నెలల తర్వాత రా" అని పంపించడం. ఇంటికి వచ్చి మళ్ళీ అదే పచ్చడి మెతుకులతో పొట్టు పడి మూడు మాసాల తర్వాత ఫిజికల్ టెస్ట్ కోసం హైదరాబాద్ వెళితే మారని శారీరక కొలతలు.రైఫిల్ మోయలేని దైన్యం. తన బ్యాచ్‌లో అందరూ ఎంపికై మద్రాసు కు వెళ్తుంటే, అవకాశం చేజారి పోతుందన్న నిస్పృహలో వచ్చే దుఃఖం ఆపుకోలేక అక్కడి ఆఫీసర్లను బ్రతిమాలి, శరీర కొలతలు పెరగకుంటే ఆరునెలల ట్రైనింగ్ అనంతరం వెనక్కి వచ్చే ఒప్పందంతో సహచరులతో మద్రాస్ పయనం. మొత్తం బ్యాచ్‌లో చిన్నవాడు అవడంతో వారు ఆటపట్టించడం, ఇవన్నీ జయసింహలో విజయం పట్ల కసిని పెంచాయి. ఎకాడమీలో దార్ఢ్యం పెరిగే ఆహారం తీసుకుంటూ రోజూ 18 గంటలు చదువు మరియు ఫిట్‌నెస్ కోసం ప్రయత్నిస్తూ ఆరు నెలల అనంతరం అన్ని విభాగాల్లో మొత్తం ఇండియా నుండి వచ్చిన 425 మందిలో మొదటివాడుగా (చిన్న వయస్కుడు 19 ఏళ్ళు)నిలిచారు. దాంతో నెలకు వచ్చే రూ390 జీతం కాకుండా అదనంగా రూ40 వచ్చేవి. అక్కడి తో ఆగక పెద్దల సలహాతో ఆగ్రా యూనివర్సిటీ నుంచి బి యస్ సి, ఎమ్ ఎస్ సి మ్యాథ్స్ చేస్తూ మెకానికల్ ఏ ఎమ్ ఐ ఈ ని కూడా 23 ఏళ్ళకు పూర్తి చేశారు.

సివిల్స్ లో ఇంటర్వ్యూకు పిలుపు వచ్చినా అదే సమయంలో దిండిగల్ ఎయిర్ ఫోర్స్ ఎకాడమీలో పైలట్ కోర్స్ లో మొదటి స్థానంలో నిలిచినందుకు పైలట్ గా ఎంపిక కావటంతో హాజరు కాలేదు, దీనికి గాను మాజీ రాష్ట్రపతి ఆర్ వెంకట్రామన్ అవార్డ్ ఇచ్చారు. ఆ తర్వాత డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజీలో కూడా అందరికంటే ముందు నిలవడంతో (చిన్న వయసు) మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. అదే సమయంలో స్క్వాడ్రన్ లీడర్‌గా ప్రమోషన్ కూడా వచ్చింది. ఇంత ఎదిగినా మూలం మరిచిపోకుండా చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు చేశారు, కుటుంబానికి అండగా నిలిచారు. చదువును అంతటితో ఆపక నిత్య విద్యార్థిగా నేటికీ ఉన్నారు.

జీవితం సాఫీగా సాగితే అలాంటి వారిని గురించి చర్చించుకోవాల్సిన అవసరమే లేదు.ఇంకా ఏదో చేయాలనే అతని తపన ఉన్న ఉద్యోగాన్ని 2008లో వదులుకునేలా చేసింది. 20 ఏళ్ళ ఎయిర్ ఫోర్స్ జీవితంలో సంపాదించిన 10లక్షల ప్రావిడెంట్ ఫండ్ మొత్తాన్ని ఫ్రెండ్ చేతిలో పెట్టి మోసపోయినందుకు భార్యాపిల్లలకు దూరమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి.కార్పొరేట్ కంపెనీలో హెచ్ ఆర్ హెడ్ గా చేరినా అదీ వదులుకోవాల్సి వచ్చింది. ఏం చేయాలా అనుకుంటున్న సమయంలో వారి పాప ఇచ్చిన ప్రోత్సాహంతో 'వస్తువులను ఒక సారి చూసి 200 వస్తువుల పేర్లను చెప్పి 'మెమోరీ లో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో పేరు నమోదు చేసుకొని నేడు మెమొరీలో వరల్డ్ నెంబర్ వన్ గా నిలిచారు. ఆ రికార్డుల పరంపరను నేటికీ కొనసాగిస్తూ 14 అంశాల్లో వరల్డ్ నెంబర్ వన్ గా ఉన్నారు. ఇదే కాకుండా యువతకు దిశా నిర్దేశం చేసేందుకు వ్యక్తిత్వ వికాస పుస్తకాలను రాస్తూ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. 35 దేశాలను చుట్టివచ్చారు. ఇప్పుడు ప్రపంచం మొత్తం మీద 1లక్షా 35వేల మందికి jayasimha.in ద్వారా వ్యక్తిత్వ వికాస శిక్షణ ఇస్తున్నారు.

తన విజయాల వెనుక అమ్మ, అన్నయ్య, మేనమామ (హెడ్ మాస్టర్) పాండురంగం వంటి వారి ప్రోత్సాహం మరిచిపోలేనిదని చెబుతూ నేడు దేశంలో ఉన్న 59% యువత ను సరైన మార్గంలో నడిపించగలిగితే ప్రపంచ పటంలో దేశం ఒక వెలుగు వెలుగుతుందని అంటూ, టైం ఈజ్ వ్యాల్యుయబుల్ కాబట్టి సరైన ప్రణాళికతో ముందుకు వెళితే సక్సెస్ మీ వెంటే ఉంటుందని జయసింహ చెప్పారు. సక్సెస్ ఇచ్చే కిక్కుకు అలవాటు పడినవారు దాన్ని వదులుకోవడానికి ఎప్పుడూ ఇష్టపడరని అన్నారు. నిరు పేద కుటుంబం నుండి నింగిని తాకే వరకు ఎదిగి, ఆటుపోట్లను ఎదుర్కొని, గమ్యం చేరినా గతాన్ని మరవని మన తెలంగాణ మట్టి బిడ్డ స్క్వాడ్రన్ లీడర్ జయసింహకు జయహో...

**ఇంటర్వ్యూ...అనితా యెలిసెట్టి**
**ఫొటోలు...సర్వేశ్వర్ రెడ్డి**

---

# వి ఆర్ ఏబుల్..!

క న్ను తెరిస్తే జననం.. మూస్తే మరణం. రెప్పపాటుది జీవితం. ఈ రెప్పపాటు జీవిత కాలంలో అన్నీ అనుభవించాలనుకుంటాం. ఆరోగ్యంగా జీవించాలనుకుంటాం. అన్ని అవయవాలు సక్రమంగా పనిచేయాలనుకుంటాం. మరి అలా కాకుండా అంగవైకల్యంతో జీవనపోరాటం చేస్తున్న వారి సంఘర్షణ ఎలాంటిది..? ప్రభుత్వం నుంచి వారు ఆశిస్తున్నదేమిటి..?

**ఎన్ఎస్ఎస్ గణాంకాలు..** 2014 జనాభా గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా 8 శాతం, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 60.17 శాతం వికలాంగులున్నారని ప్లానింగ్ కమిషన్ ఇచ్చిన శాంపిల్ సర్వే రిపోర్టులో తెలిపింది. ప్రపంచ జనాభాలో 12 శాతం వికలాంగులున్నారు. అందుకే వీరి సమస్యపై ఐక్యరాజ్యసమితి ప్రత్యేక దృష్టిసారించింది. 1992 నుంచి ప్రపంచ వ్యాప్తంగా డిసెంబర్ మూడున "డిజేబుల్డ్ డే"గా జరపాలని నిర్ణయించింది. ఒక్కో ఏడాది ఒక్కో నినాదంతో ప్రపంచ వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం కృషి సాగిస్తున్నది. భారత్‌లో గత శతాబ్ద కాలంగా జనగణన సేకరణ మొదలైనా ప్రత్యేకంగా వికలాంగుల జనాభా లెక్కల సేకరణ మాత్రం 1980 తరువాతే జరిగింది. 1981 జనగణన లెక్కల్లో తొలిసారి అంధులు, మూగవారు, నడవలేని వారంటూ మూడు రకాల వైకల్యాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. 2001 జనగణన లెక్కల్లో మరో రెండు వైకల్యాలను చేర్చి ఐదు కేటగిరీలుగా మార్చారు. టెక్నికల్ అడ్వైజరీ సూచనల మేరకు 2011లో తలసేమియా, ఆటిజమ్, కుష్ఠు వ్యాధిగ్రస్తులను కూడా వికలాంగుల కేటగిరీలో చేర్చి, ఎనిమిదిగా మార్చారు.

**వికలాంగులకు ఆర్డీటీ అండ..** వికలాంగుల్లో మహిళలు, చిన్నారులు, అల్పాదాయ వర్గాల వారే అధికంగా ఉన్నారు. ఇటువంటి వారికి విద్యావకాశాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఉద్యోగావకాశాలు అతి కొద్ది మందికి మాత్రమే దక్కుతున్నాయి. అయితే ఇలాంటి వికలాంగ మహిళల్ని చేరదీయాలని, వారికి విద్యావకాశాలు కల్పించాలని, ఆర్థికంగా వారు స్వయం పోషకులుగా మార్చేందుకు రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) సంకల్పించింది. ఈ నేపథ్యంలో సాధారణ మహిళలనే కాకుండా పాక్షిక అంధత్వం, వికలాంగులైన మహిళలకు హస్తకళల్లో శిక్షణ ఇచ్చి, వారు తయారు చేసిన వస్తువులను దేశంలోని వివిధ ప్రాంతాలకే కాకుండా స్పెయిన్ లాంటి విదేశాలకు కూడా ఎగుమతి చేస్తోంది. తాము మరొకరి భిక్షతో జీవిస్తున్నామన్న భావన వారి నుంచి తుడిచేసి వారి కళ్ళల్లో వెలుగులు నింపుతున్నది వివిధ అంశాలలో...ఆర్డీటీలోని ఇంటిగ్రేటెడ్ డెవలప్ మెంట్ ట్రస్ట్ విభాగం పేపర్, తాటి ఆకులు, జనపనార లాంటి వాటితో తయారు చేసే పట్టాలు లాంటి దాదాపు 500 రకాల వస్తువుల తయారీలో వికలాంగ మహిళలకు శిక్షణ ఇస్తుంది.

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్ మెంట్ సంస్థలో శిక్షణ తీసుకున్న మహిళలు తయారు చేసిన వస్తువులను చూసి ఆకర్షితులై గత సంవత్సరం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో వీరి తరఫున ఓ స్టాల్ ఏర్పాటు చేయాల్సిందిగా ఆహ్వానించారు. ఇక్కడ వీరు ఏర్పాటు చేసిన స్టాల్ ఐఆర్‌డి తరఫు నుంచి ద బెస్ట్ స్టాల్‌గా ఎంపిక కావడం విశేషం.



**మాకు ఇవి కావాలి...** వారంతా ఇతరులకన్నా భిన్నమైన వారు, ఒకింత తోడ్పాటు ఎక్కువగా అవసరమైనవారు. అందుకే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరుకుంటున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని వికలాంగులకు విద్య, వైద్యం, వసతుల కల్పనలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఉచితంగా అందించాలని అభ్యర్థిస్తున్నారు. బీమా సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. 33 శాతం మహిళా రిజర్వేషన్‌లో వికలాంగ మహిళలకు 3 శాతం రిజర్వేషన్ హక్కుగా ఇవ్వాలంటున్నారు. వైకల్యంతో కష్టసుఖాల మజిలీలను దాటుకుంటూ ఆనంద విషాదాల కుదుపులను తట్టుకుంటూ, గెలుపు ఓటముల ఒడిదొడుకులను అధిగమిస్తూ విజేతలుగా నిలుస్తున్నారు.

**....డి.ఎస్.కె.రెడ్డి, 7306951236**